PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :205 | పేజీలు : 8 | వెల రూ.5 | మంగళవారం 18.08.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh






• జెన్ జడ్ వ్యూహం ప్రభాత సూర్యుడు

జాతీయ కార్యవర్గంలో ఏపీకి పెద్దపీట

# బీజేపీకి కొత్త రక్తం

| జాతీయ ఉపాధ్యక్షురాలిగా వసుంధర రాజే | జాతీయ ప్రధాన కార్యదర్శిగా స్మృతి ఇరానీ | రాంమాధవ్, పురందేశ్వరికి అవకాశం | జాయింట్ కో ఆర్డినేటర్‌గా విష్ణుకుమార్‌రాజు |
|---|---|---|---|

భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సోమవారం పార్టీ కొత్త జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియా, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్‌ను జాతీయ ఉపాధ్యక్షులుగా నియమించారు. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పగించారు. ఏపీ నుంచి ఇద్దరికి జాతీయ ఉపాధ్యక్షుల జాబితాలో చోటు దక్కింది. తెలంగాణ నుంచి ఎవరికీ అవకాశం దక్కలేదు. కాగా, ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

### 13 మంది జాతీయ ఉపాధ్యక్షులు

జాతీయ ఉపాధ్యక్షులుగా మొత్తం 13 మందిని నియమించారు. వీరిలో వసుంధర రాజేతో పాటు ఉత్తరాఖండ్ మాజీ ముఖ్యమంత్రి తిరత్ సింగ్ రావత్, బైజయంత్ జయ్ పాండా, దగ్గుబాటి పురందేశ్వరి, రేఖా వర్మ, వర్షాబెన్ నరేంద్రభాయ్ దోషీ, భారతి ప్రవీణ్ పవార్, మన్‌ప్రీత్ సింగ్ బాదల్, లాల్ సింగ్ ఆర్య, ఎం. నాగరాజా, తారిక్ మన్సూర్, మధుచంద్ర కార్, రాంమాధవ్ ఉన్నారు.

### ఎనిమిది మంది జాతీయ ప్రధాన కార్యదర్శులు

జాతీయ ప్రధాన కార్యదర్శులుగా స్మృతి ఇరానీతో పాటు వినోద్ తావ్డే, సునీల్ బన్సల్, బిప్లబ్ కుమార్ దేవ్, సతీష్ పూనియా, గజేంద్ర పటేల్, హరీష్ ద్వివేది, సంజయ్ భాటియా నియమితులయ్యారు.

### బీఎల్ సంతోష్‌కు కొనసాగింపు

పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు)గా బీఎల్ సంతోష్ కొనసాగనున్నారు. సంయుక్త ప్రధాన కార్యదర్శులు (సంస్థాగత వ్యవహారాలు)గా శివప్రకాశ్, సౌదాన్ సింగ్‌లను నియమించారు.

### ఇతర కీలక నియామకాలు

జాతీయ ఖజాంచీగా కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను, సహాయ ఖజాంచీగా రాజేష్ మంగళ్‌ను నియమించారు. ఈశాన్య రాష్ట్రాల సమన్వయకర్తగా సంబిత్ పాత్ర, కేంద్ర కార్యాలయఇన్‌చార్జ్‌గా తరుణ్ చుగ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ కొత్త నియామకాలతో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రానున్న ఎన్నికలకు అనుగుణంగా బీజేపీ తన వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## పేదల ఆరోగ్యం.. మా బాధ్యత: రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**పేదల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత**

పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు.

**టిమ్స్ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం**

తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు.

**2027 డిసెంబర్ నాటికి ఆస్పత్రుల నిర్మాణం పూర్తి**

2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

## ఆ ఉగ్ర నెట్‌వర్క్‌ను భూస్థాపితం చేశాం: అమిత్ షా



ఢిల్లీ, ప్రభాత సూర్యుడుఐఎస్ఐ మద్దతు కలిగిన షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనే ఉగ్రవాద గ్రూప్‌ను నాశనం చేసినట్లు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే.. ఆ గ్రూప్‌నకు చెందిన 200 మందికిపైగా సభ్యుల్ని అరెస్టు చేసినట్లు 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. తద్వారా దాని విధ్వంసకర దాడుల ప్రణాళికలను భగ్నం చేసినట్లు తెలిపారు. ఉగ్రవాదం విషయంలో భారత్ కఠిన వైఖరికి ఇదొక ఉదాహరణ అని పేర్కొన్నారు. "షహజాద్ భట్టీ నెట్‌వర్క్‌కు అనేక ఉగ్ర కార్యకలాపాల్లో ప్రమేయం ఉంది. ఈ క్రమంలోనే భారత భద్రతా దళాలు ఇటీవల 14 రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో సమన్వయంతో కూడిన ఆపరేషన్‌లు నిర్వహించాయి. 200 మందికిపైగా ఆపరేటివ్‌లను అరెస్టు చేసి.. భట్టీ నెట్‌వర్క్‌ను నాశనం చేశాయి. ఐఎస్ఐ నిధులతో నడిచే ఈ గ్రూప్ నుంచి ఐఈడీలు, పాకిస్థాన్ ఆయుధ ఫ్యాక్టరీ గుర్తులున్న గ్రెనేడ్లు, పిస్టళ్లు, తూటాలు, గూఢచర్యం కోసం ఉపయోగించిన సీసీటీవీ కెమెరాలు సహా పెద్దఎత్తున సామగ్రిని స్వాధీనం చేసుకున్నాయి" అని అమిత్ షా తెలిపారు. ఇదిలా ఉండగా.. గత నెలలో మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) రాష్ట్రవ్యాప్తంగా ఓ భారీ ఆపరేషన్‌ను చేపట్టింది. ఇందులో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టీతో సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలపై 112 మందిని అధికారులు ప్రశ్నించారు. గ్యాంగ్‌స్టర్ భట్టీ సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల ద్వారా దేశ వ్యతిరేక కార్యకలాపాల వైపు యువతను ఆకర్షించడానికి, వారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు ఏటీఎస్ అధికారి ఒకరు తెలిపారు. ప్రభుత్వ వివరాల ప్రకారం.. షహజాద్ భట్టీ నెట్‌వర్క్ అనేది పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఒక ఉగ్రవాద గ్రూప్. భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక దీని హస్తం ఉంది.

## 'కల్యాణ లక్ష్మి' కాస్తా 'సంతాన లక్ష్మి'గా మారిపోయింది : హరీశ్ రావు



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 35 నుంచి 51 వరకు స్పష్టంగా చెబుతున్నది ఏంటంటే.. సంక్షేమం అనేది రాజ్యం ప్రాథమిక విధి. నాడు కేసీఆర్ అధికారంలోకి రాగానే ఏకంగా 42 సంక్షేమ పథకాలకు ఒకేసారి ఆమోదముద్ర వేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తెలిపారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో ముందుగా చెప్పకపోయినా.. ఆడబిడ్డలకు అండగా ఉండాలనే బాధ్యతతో అధికారంలోకి రాగానే 'కల్యాణ లక్ష్మి'ని తెచ్చి అమలు చేశాం. పక్క రాష్ట్రం తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ 100 రోజుల్లో ఆడబిడ్డల పెళ్లిళ్లకు 8 గ్రాముల బంగారం ఇస్తామని మాట ఇచ్చి, చెప్పినట్టే అమలు చేస్తున్నారు. కానీ మన రాష్ట్రంలో మాత్రం కల్యాణ లక్ష్మి దరఖాస్తులు ఏకంగా లక్షకు పైగా పెండింగ్‌లో మూలుగుతున్నాయి. పెళ్లిళ్లు జరిగి పిల్లలు పుడుతున్నా పైసలు రావడం లేదు..



# గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెపై వినతి.

కారేపల్లి ఆగస్టు 17 ప్రభాత సూర్యుడు .గ్రామపంచాయతీ కార్మికులు సమస్యల పరిష్కారానికి ఆగస్టు 18,19 తేదీల్లో రాష్ట్ర వ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నారని సింగరేణి మండల ఎం పి ఓ కు వినతి పత్రం సమర్పించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమం ఉద్దేశించి సిఐటియు సింగరేణి మండల



కన్వీనర్ కే నరేంద్ర మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల పర్మినెంట్, వేతనాల పెంపు, రెండో పి ఆర్ సి లో గుర్తింపు కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల లో హామీ ఇచ్చిన విధంగా గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయతీ సిబ్బందిని రెండో పి ఆర్ సి లో చేర్చాలి, కనీస వేతనం 26000 ఇవ్వాలి,+శీ చీశీ: 51 సవరణ చేసి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి, కారోబార్ బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ ఇవ్వాలి, ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టుగా గ్రీన్ ఛానల్ ద్వారా కార్మికులకు వేతనాలు జమ చేయాలి, పంచాయతీ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్ల స్థలాలు డబల్ బెడ్రూములు కేటాయించాలని ఈ సమస్యలపై జరుగుతున్న సమ్మెలో కార్మికులంతా పాల్గొనాలని కే నరేంద్ర పిలుపునిచ్చారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఎస్ నాగేశ్వరరావు, బోళ్ల కొమరయ్య, పాలిక తిరపయ్య,యాదగిరి, ఉపేందర్, అచ్చయ్య, ఆధర్ల శ్రీను, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ ఆగస్టు 17ప్రభాత సూర్యుడు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్, జిల్లా రెవెన్యూ అధికారి మాలతి ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, చట్టపరిధిలో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పట్ల అధికారులు బాధ్యతాయుతంగా





వ్యవహరించాలని, ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు, దరఖాస్తుదారులు మొత్తం 92 అర్జీలను అధికారులకు సమర్పించారు. ప్రధానంగా రెవెన్యూ, భూ సమస్యలు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పింఛన్లు, డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సరఫరా, ఆసరా పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలపై వినతులు అందాయి.ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీకి సంబంధించి తదుపరి చర్యలను వేగవంతం చేసి, నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిధిలోని వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ రంగానికి యువ మేనేజ్‌మెంట్ ప్రతిభకు దిశానిర్దేశం

### పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి: నిపుణుల సూచన






తూంకుంట, ఆగస్టు 17: ప్రభాత సూర్యుడువిశ్వ విశ్వాని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిస్టమ్స్ అండ్ మేనేజ్‌మెంట్‌లో పీజీడీఎం 2026--28 బ్యాచ్‌కు ఇనాగరల్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్తగా మేనేజ్‌మెంట్ విద్యలో అడుగుపెట్టిన విద్యార్థులకు ఈ కార్యక్రమం ఉత్సాహాన్ని, భవిష్యత్ కెరీర్‌పై స్పష్టతను అందించింది.రెండేళ్ల పీజీడీఎం కోర్సును పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాక్టికల్ లెర్నింగ్, నైపుణ్యాభివృద్ధి, ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్‌కు ప్రాధాన్యమిస్తూ విద్యార్థులను కార్పొరేట్ రంగానికి సిద్ధం చేసే విధంగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమానికి పీజీడీఎం డీన్ డాక్టర్ జయశ్రీ, కోఫౌండర్ జీఎస్ఎస్ వెంకటేశ్వరరావు, అజిత్ మిశ్రా ప్రత్యేక అతిథులుగా, లక్ష్మీరాయ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా కెరీర్ గైడెన్స్, భవిష్యత్ ఉద్యోగ అవకాశాలు, పరిశ్రమలో అవసరమైన నైపుణ్యాలు, కార్పొరేట్ రంగంలో రాణించేందుకు అనుసరించాల్సిన విధానాలపై వారు విలువైన సూచనలు అందించారు.పీజీడీఎం విద్యార్థులు కేవలం అకడమిక్ పరిజ్ఞానానికే పరిమితం కాకుండా కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్, నాయకత్వ లక్షణాలు, సమస్య పరిష్కార సామర్థ్యం వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అతిథులు సూచించారు. మారుతున్న పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ జ్ఞానం, నైపుణ్యాలను నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. కొత్త బ్యాచ్ విద్యార్థులకు ఈ ఇనాగరల్ కార్యక్రమం భవిష్యత్ లక్ష్యాలపై దిశానిర్దేశం చేసే వేదికగా నిలిచింది. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పీజీడీఎం విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్రమ వేటగాళ్లను కఠినంగా శిక్షించాలి.

### కాంగ్రెస్ నాయకులు మేకల మల్లిబాబు యాదవ్..



కారేపల్లి ఆగస్టు 17ప్రభాత సూర్యుడుజంతువులను వేటాడటానికి అక్రమంగా వేటగాళ్లు విద్యుత్తు ఉచ్చులకు జంతువులతో పాటు సాధారణ మనుషులు ఫారెస్ట్ అధికారులు బలి అవుతున్నారు. వారి ఆగడాలకు అంతులేకుండా పోయింది. దీనిలో భాగంగా ఇటీవల కారేపల్లి మండలం గిద్దవారిగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ బానోతు దేవ్లా నాయక్ కుమారుడు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ నవీన్ నాయక్ కర్తవ్య నిర్వహణలో భాగంగా ఫారెస్ట్ లో అక్రమంగా వేసిన విద్యుత్ తీగలు తగిలి దుర్మరణం చెందారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి షేక్ పతే మహమ్మద్, పిఏసిఎస్ అధ్యక్షులు, పుచ్చకాయల వీరభద్రం ధనియాకుల హనుమంతరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్రు నాయక్ తదితరులు వారి కుటుంబాన్ని పరామర్శించి నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి అక్రమ వేటగాళ్లను, ఎంతటి వారైనా ఉపేక్షించకుండా భవిష్యత్తులో ఇలాంటి అధికారులను పోగొట్టుకోకుండా ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి, కుటుంబానికి మేము వెన్నుదన్నుగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అడ్డగోడ ఐలయ్య, ముత్యాల సత్యనారాయణ ఉన్నం వీరేందర్ రావూరి శ్రీనివాస్, ఏపూరి మల్లికార్జున్ దేగల ఉపేందర్ లక్ష్మణ్, గ్రామాల సర్పంచులు మాజీ ఎంపీటీసీ లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### అధికారులకు అదనపు కలెక్టర్ పాండు ఆదేశం


సంగారెడ్డి, ఆగస్టు 17ప్రభాత సూర్యుడుప్రజావాణిలో అందే ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. పెండింగ్ దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 56 ఫిర్యాదులు, వినతులు అందాయి. వీటిలో రెవెన్యూ, హౌసింగ్, పెన్షన్లు, పంచాయతీరాజ్,



కాలుష్య నియంత్రణ మండలి, సంక్షేమ శాఖలకు సంబంధించిన సమస్యలు ప్రధానంగా ఉన్నాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి.... జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.

ఖమ్మం, ఆగస్టు 17 ప్రభాత సూర్యుడుప్రజావాణిలో తమ సమస్యలు తెలుపుతూ ప్రజలు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.రఘునాధపాలెం మండలం పాపటపల్లి గ్రామానికి చెందిన చౌడవరపు దుర్గమ్మ తన కుమారుడు తనను అనేక బాధలు పెడుతున్నారని అతనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా జిల్లా సంక్షేమ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కల్లూరు మండలం ఓబులరావు బంజర



గ్రామానికి చెందిన భూక్యా మురళీ తాను శారీరకంగా దివ్యాంగుడినని తాను డిగ్రీ బీకాం కంప్యూటర్ చదివానని తనకు ఏదైనా ప్రభుత్వ శాఖలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉపాధి కల్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఉపాధి అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కొణిజర్ల మండలం మల్లుపల్లి గ్రామానికి చెందిన రైతులు సర్వేనెంబర్ 19 లో తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వ్యవసాయం సాగు చేసుకుంటున్నామని, సర్వే నెంబర్ 19 అటవీ భూమికి సరిహద్దున ఉన్నందున పట్టా పాస్ పుస్తకాలు రాలేదని, 1950 మ్యాపు ప్రకారం తమకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ చర్యలు తీసుకోవాలని తెలిపారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తమకు నాలుగు నెలలుగా పెండింగ్ ఉన్న జీతాలు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఎస్ ఈ మిషన్ భగీరథకు రాస్తూ, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.కూసుమంచి మండలం పాలేరు గ్రామానికి చెందిన కే. ఉపేందర్ తాను రెండు సంవత్సరాలుగా ర్యాపిడో బైక్ నడుపుకుంటున్నాని, ఎస్సీ కార్పొరేషన్ లో ఆటో కొరకు దరఖాస్తు చేసుకున్నానని చాలా పేదరికంలో ఉన్నానని తనకు ఆటో ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారికి రాస్తూ పరిశీలించి అవకాశం మేరకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# వెంకటాపురం మండలంలో ప్రజావాణి హెల్ప్ డెస్క్

### ఎంపీడీవో ప్రవీణ్ కుమార్




ములుగు ఆగస్టు 17 ప్రభాత సూర్యుడువెంకటాపురం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపే లక్ష్యంతో వెంకటాపురం మండలంలో ప్రజావాణి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. మండల ప్రజలు తమ సమస్యలు, వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవచ్చు.ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చే వినతులను సోమవారం 4 దరఖాస్తులను స్వీకరించి, వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం హెల్ప్ డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా అందేలా, వారి సమస్యలకు సత్వర పరిష్కారం లభించేలా ప్రజావాణి హెల్ప్ డెస్క్ ద్వారా చర్యలు కొనసాగుతున్నాయి. అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యనారాయణ, ఎంపీ ఓ నారాయణ, హౌసింగ్ ఏఈ జన్య, మిషన్ భగీరథ ఏఈ కృష్ణ కుమార్, అంగన్వాడి సూపర్వైజర్ చంద్రకళ, ఇరిగేషన్ ఏఈ రవితేజ, ఎం ఏ ఓ నవీన్, ఎఫ్బి ఓ బాలు తదితరులు పాల్గొన్నారు

# సుబ్బయ్య కుంట చెరువు శిఖం పరిరక్షణ, శాశ్వత హద్దులు కేటాయించాలని వినతి.




కారేపల్లి ఆగస్టు 17 ప్రభాత సూర్యుడుసింగరేణి గ్రామపంచాయతీ సమీపంలో ఉన్న సుబ్బయ్య కుంట చెరువు శిఖం సర్వేనెంబర్ 171 లో 22 ఎకరాల 18 గుంటల భూమి ఉండగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువు శిఖం సమీపాన ఉన్న సర్వే నెంబర్ 165/2/1/2 సింగరేణి మండల తహసిల్దార్ 2018లో హరిజన కులానికి చెందిన బొందల ఎర్ర లచ్చయ్య వద్ద నుండి వారు కొన్న భూమికి పట్టా ఉండగా మరల పట్ల ఇచ్చారని, దానిని ఆసరా చేసుకొని సుబ్బయ్య కుంట చెరువు శిఖం సర్వేనెంబర్ 171 లో ఉన్న 22 ఎకరాల 18 గుంటల భూమిలో నుండి సుమారు మూడు ఎకరాల భూమి ఆక్రమించుకొని భవన నిర్మించుకున్నట్లు చుట్టూ ఉన్న భూమిని ఇతరులకు చూపిస్తూ అట్టి భూమిని విక్రయిస్తున్నారని, సుబ్బయ్య కుంట చెరువు శిఖం సర్వేనెంబర్ 171 లో ఉన్న భూమిని అక్రమనకు గురికాకుండా సర్వే చేయించి హద్దులు చూపాలని సింగరేణి మండలం ఎంపీడీవోని గ్రామ ఉపసర్పంచ్ భాగ్యలక్ష్మి, వార్డు మెంబర్ అంజయ్య, సాంబ, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు బాలకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు కంపాటి రవి వినతి పత్రం అందించారు.

# కూకట్‌పల్లి ఫోటో జర్నలిస్టులకు రాష్ట్ర స్థాయి అవార్డుల పంట

### దక్కన్ క్రానికల్, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి ప్రతినిధులకు ఘన సన్మానం

కూకట్‌పల్లి, ఆగస్టు 17 ప్రభాత సూర్యుడు శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని వివేకానంద నగర్ కాలనీలో తెలంగాణ స్టేట్ ఫోటో జర్నలిస్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యూస్ ఫోటో కాంపిటీషన్--2026లో రాష్ట్ర స్థాయి అవార్డులు సాధించిన కూకట్‌పల్లి ఫోటో జర్నలిస్టులను కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. న్యూస్ ఫోటో కాంపిటీషన్‌లో ప్రతిభ కనబరిచిన దక్కన్ క్రానికల్ ఫోటో జర్నలిస్ట్ దుర్గారావు, నమస్తే తెలంగాణ జర్నలిస్ట్ శ్రవణ్ కుమార్, ఆంధ్రజ్యోతి ఫోటో జర్నలిస్ట్ మాచర్ల నాగేశ్వరరావులకు అవార్డులు దక్కాయి. ఈ




సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎర్ర యాకయ్య, ప్రధాన కార్యదర్శి నాగుల అంజిబాబు వారిని అభినందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎర్ర యాకయ్య మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారుల పరిస్థితులను, వారి జీవన చిత్రాలను ప్రతిబింబించేలా తీసిన ఫోటోలకు ఈ గుర్తింపు లభించడం అభినందనీయమన్నారు. ప్రజా సమస్యలను, సామాన్యుల జీవన చిత్రాలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు వాటి పరిష్కారానికి కృషి చేయడం ఫోటో జర్నలిస్టులకు ఎంతో సంతృప్తినిచ్చే విషయమని కొనియాడారు.ప్రజా సమస్యలను తమ కెమెరా కళ్లతో సమాజం ముందుకు తీసుకువస్తున్న ఫోటో జర్నలిస్టులకు రాష్ట్ర స్థాయి గుర్తింపు లభించడం పట్ల కూకట్‌పల్లి జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డులు జర్నలిస్టుల సామాజిక బాధ్యతను మరింత పెంచుతాయని పేర్కొన్నారు.

# కుందన్ పల్లిలో షెడ్ల నిర్మాణాలపై వివాదం

### నిబంధనలు పాటిస్తున్నారా..
### అనుమతులపై అధికారులు స్పష్టత ఇవ్వాలంటున్న స్థానికులు

కీసర, ఆగస్టు 16(ప్రభాత సూర్యుడు మేడ్చల్ జిల్లా కీసర సర్కిల్ జీహెచ్ఎంసీ పరిధిలోని కుందన్ పల్లిలో కొనసాగుతున్న షెడ్ల నిర్మాణాలపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని నిర్మాణాలకు అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై స్పష్టత లేదని, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు వాపోతున్నారు.



**నిబంధనల అమలుపై ప్రశ్నలు**

కుందనపల్లిలో నిర్మిస్తున్న షెడ్లకు నిర్మాణ అనుమతులు, స్థల వినియోగానికి సంబంధించిన నిబంధనలు, ఇతర అవసరమైన అనుమతులు అమలులో ఉన్నాయా అనే అంశాలను అధికారులు పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. నిర్మాణాల స్వరూపం, విస్తీర్ణం, వినియోగం తదితర అంశాలను తనిఖీ చేసి వాస్తవ పరిస్థితిని వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.




**ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం?**

అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే జీహెచ్ఎంసీకి రావాల్సిన రుసుములు, పన్నులు తదితర ఆదాయాలపై ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రతి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, పన్నుల వివరాలను పరిశీలించి ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరగకుండా చూడాలని కోరుతున్నారు.

**క్షేత్రస్థాయి తనిఖీలకు డిమాండ్**

షెడ్ల నిర్మాణాలపై స్థానికుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ వినిపిస్తోంది. నిర్మాణ స్థలాలను పరిశీలించి అనుమతుల వివరాలను ధృవీకరించిన అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్మాణాలు పునరావృతం కాకుండా పర్యవేక్షణ పెంచాలని కోరుతున్నారు. కుందనపల్లిలో షెడ్ల నిర్మాణాలపై వస్తున్న ఆరోపణలకు అధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితిని ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ నిధులు విడుదల చేయాలి

### హైకోర్టులో వెంటనే కౌంటర్ దాఖలు చేయాలి
### తహసీల్దార్‌కు బీఆర్ఎస్ మండల కమిటీ వినతి
### బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంప రాంబాబు

ములుగు ఆగస్టు 17, (ప్రభాత సూర్యుడు)పేదింటి ఆడపడుచుల వివాహాలకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల నిధులు వెంటనే విడుదల చేయాలనీ బిర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంప రాంబాబు ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కి మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప రాంబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి ఆడబిడ్డకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించి నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ పథకాల నిధుల విడుదలకు సంబంధించి ప్రభుత్వం హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు.



**పెళ్లిళ్లు నిశ్చయమై.. ఎదురుచూపులు**

ఆర్థిక సాయం కోసం ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అనేక మంది లబ్ధిదారులు నిధుల కోసం ఎదురుచూస్తున్నారని నాయకులు తెలిపారు. పెళ్లిళ్లు నిశ్చయమైన కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సాయం అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయడంతో పాటు, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రావాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఆందోళనలకు సిద్ధం ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే పేదింటి ఆడపడుచుల తరఫున బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దశలవారీగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని నాయకులు హెచ్చరించారు. తహసీల్దార్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చిడెం రవికుమార్ ,వేల్పూరి లక్ష్మి నారాయణ, మంచర్ల బేగ సంబశివారావు, సర్పంచ్ లు ఆదిలక్ష్మి, ఓంపతి పార్టీ శ్రేణులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# బర్త్ సర్టిఫికెట్ కోసం ఎవరూ డబ్బులు అడగలేదు

### మల్లంపల్లి గ్రామ నివాసి ఓర్సు లలిత

ములుగు ఆగస్టు 17 ప్రభాత సూర్యుడుములుగు జిల్లా బర్త్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లేదా సిబ్బంది తనను ఎలాంటి డబ్బులు అడగలేదని మల్లంపల్లి గ్రామానికి చెందిన ఓర్సు లలిత స్పష్టం చేశారు. గత నాలుగు నెలలుగా బర్త్ సర్టిఫికెట్ కోసం కార్యాలయానికి పలుమార్లు వచ్చినట్లు తెలిపిన ఆమె, ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియలో పత్రాలకు సంబంధించిన వ్యత్యాసాలు ఉండటంతో పాఠశాల నుంచి అవసరమైన సర్టిఫికెట్ తీసుకురావాలని సిబ్బంది సూచించినట్లు వివరించారు.పని ఆలస్యం కావడంతో డబ్బులు ఇస్తే త్వరగా పని చేస్తారా అనే ఉద్దేశంతో తానే డబ్బుల విషయాన్ని ప్రస్తావించానని, కానీ కార్యాలయంలో ఎవరూ తనను డబ్బులు అడగలేదని ఆమె స్పష్టంగా వెల్లడించారు. తన మాటలను వేరే విధంగా ప్రచారం చేయడం సరికాదని తెలిపారు.అదేవిధంగా, ఓర్సు లలిత భారతి వీఓ పరిధిలోని సిరివెన్నెల సంఘంలో 04-08-2018న రూ.83,000 రుణం తీసుకుని, 16 నెలల పాటు నెలకు రూ.3,000 చొప్పున చెల్లించినట్లు సమాచారం ఉంది. మిగిలిన అసలు, వడ్డీ బకాయిలు ఉన్న సమయంలో సంఘం డిఫాల్ట్‌లోకి వెళ్లిందని, అలాంటి పరిస్థితుల్లో వడ్డీ లేని రుణం మంజూరు కావడంపై కూడా స్పష్టత అవసరమని పేర్కొన్నారు.ప్రభుత్వం నుంచి తనకు అర్హత ఉన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయని లలిత స్వయంగా చెప్పడం కూడా ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చింది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో రాజకీయ ప్రయోజనాల కోసం మహిళతో తప్పుడు ఆరోపణలు చేయించి వీడియోలు రికార్డు చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.అధికారులపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించకుండా, వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే ప్రచారం చేయాలని కోరారు. బర్త్ సర్టిఫికెట్ వ్యవహారంలో లలిత స్వయంగా ఇచ్చిన వివరణతో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.



# ఏటూరునాగారం ఐటీడీఏ ముట్టడి విజయవంతం

### ఆదివాసీ హక్కుల కోసం 2 వేల మందితో భారీ ర్యాలీ -- ఐటీడీఏ వద్ద ధర్నా




ములుగు ఆగస్టు 17 ప్రభాత సూర్యుడుఏటూరునాగారం మండల కేంద్రంలో ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణ, ఏజెన్సీ ప్రాంత అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కోసం ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ ఆధ్వర్యంలో సోమవారం ఏటూరునాగారంలో చేపట్టిన ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం విజయవంతమైంది. సుమారు 2 వేల మంది ఆదివాసీలు, యువత, మహిళలు, వివిధ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల కోసం గళమెత్తారు. ఆగస్టు 17న ఐటీడీఏ ముట్టడికి పిలుపునిచ్చిన విషయం గతంలోనూ ప్రచురితమైంది. వై జంక్షన్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన ఆదివాసీలు చేతుల్లో జెండాలు, డిమాండ్లతో కూడిన ప్లకార్డులు పట్టుకుని “జై ఆదివాసీ”, “జల్--జంగల్--జమీన్”, “జీవో నంబర్ 3 పునరుద్ధరించాలి”, “1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి” అంటూ నినాదాలు చేస్తూ ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట సుమారు గంటపాటు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర, జాతీయ నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల హక్కులను కాపాడటంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రధాన డిమాండ్లు జీవో నంబర్ 3ను వెంటనే పునరుద్ధరించాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలి. ఐటీడీఏలను బలోపేతం చేసి, వాటి ద్వారా ఆదివాసీలకు మరిన్ని అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఐటీడీఏ పరిధిలోని ఉద్యోగ అవకాశాలను స్థానిక ఆదివాసీలకు ప్రాధాన్యతనిస్తూ భర్తీ చేయాలి. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు జీవో నంబర్ 109 ప్రకారం 75 శాతం రిజర్వేషన్ కల్పించాలి. వలస ఆదివాసీలకు అర్హత మేరకు ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి. ఆదివాసీలు సాగు చేస్తున్న సుమారు 8 లక్షల ఎకరాల పోడు సాగుభూములకు హక్కు పత్రాలు మంజూరు చేయాలి. ఆదివాసీల భూములను అన్యాక్రాంతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలనే డిమాండ్‌పై ప్రభుత్వం తక్షణం స్పందించాలి. తుడుం దెబ్బ నాయకులు మాట్లాడుతూ ఆదివాసీల భూమి, అడవి, హక్కులు, ఉపాధి, భవిష్యత్తు కోసం ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. చట్టాలు కాగితాలకే పరిమితం కాకుండా ఏజెన్సీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో అమలయ్యే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ధర్నా అనంతరం నాయకులు తమ ప్రధాన డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి సమర్పించారు. ఆదివాసీల సమస్యలను ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే పరిష్కరించి, ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు కోరారు.ఆదివాసీల హక్కుల కోసం ప్రారంభమైన ఈ ఉద్యమం ఒక్కరోజు కార్యక్రమం కాదు... హక్కులు సాధించే వరకు మా పోరాటం కొనసాగుతుంది అని తుడుం దెబ్బ నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జాతీయ అధ్యక్షులు వట్టం ఉపేందర్, ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు యాసం రాజు, రాష్ట్ర అధ్యక్షులు గొడెం గణేష్ ప్రధాన కార్యదర్శి కబ్బాక శ్రావణ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కొమురం లక్ష్మీకాంత, తెలంగాణ రాష్ట్ర భూమిపుత్ర సంఘం పూనెం రామచందర్ తదితరులు పాల్గొన్నారు.




# మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

### ప్రజావాణిలో సీపీఐ(ఎం) నేతల వినతి.

ప్రభాత సూర్యుడుకారేపల్లి ఆగస్టు 17.ఏజెన్సీ మండలమైన సింగరేణిలో ప్రజలకు మెరుగైన విద్య,వైద్యం,రవాణా,మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు.సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రభుత్వ ప్రజావాణి కార్యక్రమంలో సీపీఐ(ఎం) సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో పలు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు,మండల కార్యదర్శి కె.నరేంద్ర మాట్లాడుతూ కారేపల్లి మండలంలో 41 గ్రామ పంచాయతీలు,86 శివారు గ్రామాలు ఉండగా సుమారు 70 వేల మంది జనాభా నివసిస్తున్నారని తెలిపారు.ఇంత పెద్ద జనాభా ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన వైద్య,విద్య,రవాణా సదుపాయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడం ఆందోళనకరమన్నారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసి 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని డిమాండ్ చేశారు.మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన వైద్యులు,సిబ్బందిని నియమించడంతో పాటు ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించాలని కోరారు.మండల విస్తీర్ణం,జనాభాను దృష్టిలో పెట్టుకొని మరో ప్రాంతంలో కొత్త ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం ఖాళీగా ఉన్న మహిళా వైద్యురాలు,ఫార్మసిస్ట్,సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు.విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్,ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ప్రహరీ గోడలు నిర్మించాలని కోరారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన చోట వంట షెడ్లు నిర్మించాలని,ఎస్సీ,బీసీ హాస్టళ్లకు సొంత భవనాలు మంజూరు చేసి విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు.అలాగే మాణిక్యారం నుంచి మోట్లగూడెం వరకు మెటల్ వేసి అసంపూర్తిగా వదిలేసిన బీటీ రోడ్డు నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.మండలంలోని అన్ని గ్రామాలు,శివారు ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం అందేలా ఆర్టీసీ బస్సులను నడపాలని కోరారు.ఏజెన్సీ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజావాణిలో సమర్పించిన సమస్యలపై అధికారులు కేవలం వినతిపత్రాలు స్వీకరించడానికే పరిమితం కాకుండా,సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కార చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు వజ్జా మారావు,కొండబోయిన ఉమావతి,యనమనగండ్ల రవి,ముండ్ల ఏకాంబరం, కేసగాని ఉపేందర్,రేగళ్ల మంగయ్య,గంగా ధరణి,ఉపేందర్,భాగం వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




# చర్ల ఎంపీడీఓ,తహసీల్దార్ కి ఘనంగా సన్మానం చేసిన తుడుందెబ్బ బృందం.



చర్ల ఆగస్టు 17 ప్రభాత సూర్యుడుసోమవారం చర్ల మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో ఉత్తమ ఎంపీడీఓ గా అవార్డు అందుకున్న చర్ల ఎంపీడీఓకి ఘన సన్మానం చేసిన తుడుందెబ్బ బృందం అలాగే ఉత్తమ ~ాజు=ా గా అవార్డు అందుకున్న చర్ల తహసీల్దార్ కి సన్మానం చేసిన తుడుందెబ్బ బృందం ఈ సందర్భంగా... తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు వాసం. ముసలయ్య మాట్లాడుతూ చర్ల విధులు నిర్వహిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోనే ఉత్తమ ఎంపీడీఓ అవార్డు అందుకున్నందుకు చాల గర్వంగా ఉందని అలాగే ఏజెన్సీ లో ఇలాంటి అధికారులు ఉండటశీ గర్వంగా ఉందని అన్నారు. చర్ల తహసీల్దార్ కి ఉత్తమ ~ాజు=ా గా అవార్డు రావడం చాల ఆనందంగా ఉందని అన్నారు. చర్ల ఎంపీవో కి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమం లో తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం. వరప్రసాద్ తుడుందెబ్బ సీనియర్ నాయకులు తాటి. వెంకటరావు. తుడుందెబ్బ మండల యువ నాయకులు పూనెం. రవికిరణ్ పురిటి. ప్రశాంత్. ఇర్ప. అరుణ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి సలహా కమిటీ సమావేశం

### కలెక్టర్ బోర్డడే హేమంత్ సహదేవరావు



ములుగు ఆగస్టు 17 ప్రభాత సూర్యుడుములుగు జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు, జిల్లా సాగునీటి సలహా కమిటీ సమావేశం మంగళవారం ఉదయం 10:30 గంటలకు ములుగు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించబడుతుందనీ, ఈ సమావేశంలో రామప్ప, లక్నవరం, ఎస్ ఆర్ ఎస్ పి పాలెం వాగు తదితర ప్రాజెక్టులలో నీటి లభ్యత, నీటి విడుదల తదితర అంశాలపై చర్చించబడుతుంది.కావున, సంబంధిత సర్పంచులు, రైతులు, రాజకీయ నాయకుల సమావేశం కు తప్పనిసరిగా హాజరు కాగలరాని.ప్రస్తుత పంటలకు అవసరమైన నీటి విడుదల, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలపై వారి సమస్యలు, సూచనలు అభిప్రాయాలను సమావేశంలో తెలియజేయాలని తెలిపారు



# రష్మిక కామెంట్ పై రెస్పాండ్ అయిన యష్



కన్నడ చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు భారీ డిస్కషన్ కు దారితీసిన రష్మిక మందన్న మిస్టర్ షోఆఫ్ కామెంట్ కు ఇప్పుడు యష్ స్వయంగా స్పందించారుకన్నడ చిత్ర పరిశ్రమలో ఒకప్పుడు భారీ డిస్కషన్ కు దారితీసిన రష్మిక మందన్న మిస్టర్ షోఆఫ్ కామెంట్ కు ఇప్పుడు యష్ స్వయంగా స్పందించారు. చాలా ఏళ్ల క్రితం రష్మిక కెరీర్ ఆరంభ దశలో ఉన్నప్పుడు ఓ కార్యక్రమంలో కన్నడ సినీ పరిశ్రమలో మిస్టర్ షోఆఫ్ ఎవరు అని అడిగిన ప్రశ్నకు యష్ పేరు చెప్పగా, ఆ తర్వాత యష్ ఫ్యాన్స్ నుంచి రష్మికపై విమర్శలు వెల్లువెత్తాయి. అయితే కాలం గడిచిపోయిన తర్వాత కూడా ఆ కామెంట్ మాత్రం అప్పుడప్పుడు సోషల్ మీడియాలో డిస్కషన్ కు వస్తూనే ఉంది. తాజాగా రజత్ శర్మ నిర్వహించే ఆప్ కీ అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్న యష్‌కు ఇదే విషయంపై ప్రశ్న ఎదురైంది. అయితే గతాన్ని గుర్తు చేసుకున్న యష్ ఎలాంటి అసహనం వ్యక్తం చేయకుండా చాలా కూల్‌గా రియాక్ట్ అవడం ఆసక్తిని కలిగించింది. ప్రతి ఒక్కరికీ తమదైన అభిప్రాయం ఉంటుందని, ఒక వ్యక్తి తన గురించి ఏమనుకుంటున్నారనే దాని ఆధారంగా తన వ్యక్తిత్వాన్ని డిసైడ్ చేసుకోలేనని ఆయన స్పష్టం చేశారు. అప్పటికి రష్మిక ఇండస్ట్రీలో కొత్తగా ఉన్న విషయాన్ని కూడా యష్ ప్రస్తావించారు. టెలివిజన్ కార్యక్రమాల్లో ఇలాంటి ప్రశ్నలు ఎదురైనప్పుడు, ఇచ్చిన ఆప్షన్లలో ఒకదాన్నే ఎంచుకోవాల్సి వచ్చినప్పుడు ఆమె ఆ కామెంట్ ను చెప్పి ఉండొచ్చని, అందుకే దాన్ని పర్సనల్ గా తీసుకుని తనను తాను మార్చుకోవాల్సిన అవసరం లేదని యష్ చెప్పినట్టుగా తెలుస్తోంది. ఇక ఈ సందర్భంగా తన ఫ్యాన్స్ కు కూడా యష్ ఓ కీలక సందేశం ఇచ్చారు. తాను అభిమానించే మరో నటుడిని గౌరవించలేని వ్యక్తిని నిజమైన యష్ అభిమానిగా భావించనని స్పష్టం చేశారు. దీంతో తన పర్సనల్ ఇమేజ్ కంటే సినీ ఇండస్ట్రీలో పరస్పర గౌరవానికే ప్రాధాన్యత ఇస్తున్నాననే మెసేజ్‌ను ఆయన ఇచ్చారు. ఇక కెరీర్ పరంగా చూసుకుంటే యష్ ప్రస్తుతం భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న టాక్సిక్ లో ఆయన హీరోగా నటిస్తున్నారు. దాంతో పాటూ నితీష్ తివారి తెరకెక్కిస్తున్న రామాయణలో రావణుడిగా కనిపించనున్నారు యష్. ఈ రెండు సినిమాలపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# రన్‌టైమ్: నిడివి పెరిగినా ప్రేక్షకుల ఆదరణ!

వెండితెరపై సినిమా చూసే అనుభవంలో కాలక్రమేణా అనేక మార్పులు వస్తున్నాయి.వెండితెరపై సినిమా చూసే అనుభవంలో కాలక్రమేణా అనేక మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు సినిమాలకు రెండున్నర గంటల నిడివి మాత్రమే ఐడియల్ రన్‌టైమ్‌గా ఉండేది. అంతకంటే ఎక్కువైతే ప్రేక్షకులు బోర్ ఫీలవుతారనే అపనమ్మకం ట్రేడ్ వర్గాల్లో ఉండేది. కానీ ప్రస్తుతం ఆ లెక్కలన్నీ తలకిందులవుతున్నాయి. కథలో దమ్ముంటే, భావోద్వేగాలు పండుతుంటే నిడివి ఎంత ఉన్నా? ప్రేక్షకులు ఆస్వాదిస్తారనే నిజాన్ని



ఇటీవలి కాలంలోని బాక్సాఫీస్ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుత ట్రెండ్‌ను పరిశీలిస్తే -పుష్ప 2-, -యానిమల్-, -ఆర్‌ఆర్‌ఆర్- వంటి భారీ చిత్రాలు మూడు గంటల నిడివిని దాటినా బాక్సాఫీస్ వద్ద అసాధారణ విజయాలను నమోదు చేశాయి. రీసెంట్‌గా రిలీజ్ అయిన రణ్‌వీర్ సింగ్ -ధురంధర్- చిత్రం కూడా సుదీర్ఘమైన రన్‌టైమ్‌తో థియేటర్లలోకి వచ్చి అద్భుతమైన వసూళ్లను సాధించి సరికొత్త రికార్డులను సృష్టించింది. ఈ విజయాపజయాల సరళి చూస్తే? ప్రేక్షకులకు నిడివితో పనిలేదని, బలమైన కంటెంట్ ఉంటే గంటల తరబడి థియేటర్లలో కూర్చునేందుకు సిద్ధంగా ఉన్నారని రుజువవుతోంది. ఈ కోవలోనే కన్నడ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో యశ్ హీరోగా తెరకెక్కిన మోస్ట్ అవేటెడ్ మూవీ -టాక్సిక్- కూడా భారీ నిడివితో రాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం ఏకంగా 3 గంటల 14 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు సమాచారం. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇంతటి సుదీర్ఘ రన్‌టైమ్ ఉండటం ఆసక్తికరంగా మారినా? మేకర్స్ మాత్రం కంటెంట్‌పై పూర్తి విశ్వాసంతో ఉన్నారు. సినిమాలో ల్యాగ్ ఉందా లేదా అనేది నిడివిని బట్టి నిర్ణయించలేమని, కథ చెప్పే విధానం .. స్క్రీన్ ప్లే గ్రిప్పింగ్‌గా ఉంటే మూడు గంటల సమయం కూడా నిమిషాల్లో గడిచిపోతుందని ట్రేడ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. దర్శకులు తాము చెప్పాలనుకున్న భావోద్వేగాలను, పాత్రల లోతును ప్రేక్షకులకు పూర్తిగా అనుభూతి చెందించడానికి పెద్ద చిత్రాలకు అదనపు సమయం ఎంతో అవసరమవుతోంది. అందుకే కంటెంట్ డిమాండ్ చేసినప్పుడు నిడివిని తగ్గించడానికి దర్శక నిర్మాతలు వెనుకాడటం లేదు. మొత్తానికి సినిమాలో విషయం ఉంటే? రన్‌టైమ్ మ్యాటర్ కాదు అనే సరికొత్త సూత్రం ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ట్రెండ్‌గా మారింది. ప్రేక్షకులకు విజువల్ వండర్‌తో పాటు బలమైన డ్రామాను అందించగలిగితే? వారు సినిమా నిడివిని సమస్యగా చూడరని భారీ చిత్రాల విజయం నిరూపిస్తోంది. రాబోయే రోజుల్లో పెద్ద బడ్జెట్ పాన్-ఇండియా సినిమాలన్నీ ఇదే బాటలో నడిచే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిణామాలు దర్శకులకు మరింత స్వేచ్ఛను ఇస్తున్నాయి. కమర్షియల్ హంగుల కోసం కథను కుదించాల్సిన అవసరం లేకుండా ఊహాశక్తికి తగినట్లుగా పూర్తి స్థాయి సినిమాను తెరకెక్కించే వెసులుబాటును ఈ ట్రెండ్ కల్పిస్తోంది. ప్రేక్షకులు కూడా ఎంటర్‌టైన్‌మెంట్ మాత్రమే కాకుండా పరిపూర్ణ సినిమా అనుభూతిని కోరుకుంటున్నారనడానికి సుదీర్ఘ చిత్రాల భారీ విజయమే తిరుగులేని నిదర్శనంగా భావిస్తున్నారు.

# సమంత మరో స్టార్ కి నో చెప్పిందా?

టాలీవుడ్ - కోలీవుడ్ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రస్తుతం ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చర్చనీయాంశమవుతోంది.టాలీవుడ్ - కోలీవుడ్ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రస్తుతం ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చర్చనీయాంశమవుతోంది. అగ్ర నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించే అవకాశాన్ని సామ్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. టాలీవుడ్ కు చెందిన ఓ స్టార్ హీరో సరసన నటించాల్సిన ఈ భారీ ప్రాజెక్ట్‌కు సమంత నో చెప్పడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్ ఇప్పుడే పట్టాలెక్కేది కాదని, సరిగ్గా ఏడాది తర్వాత ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలం పాటు సెట్స్‌లో ఉండాల్సిన ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్స్ ... భవిష్యత్ ప్రణాళికలు తన ప్రస్తుత వ్యక్తిగత,



వృత్తిపరమైన ఆలోచనలకు సరిపడకపోవడంతోనే సమంత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సామ్ డేట్స్ కేటాయించలేనని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా సమంత సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న బలమైన పాత్రలను మాత్రమే ఎంచుకుంటున్నారు. అలాగే సమంత ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యతనిస్తూ ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్నారు. ఏడాది తర్వాత ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పుడే కమిట్ అయితే ఇతర ప్రణాళికలకు ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే సమంత ఈ ఆఫర్‌ను వదులుకుంటుంది అన్నది మరో వెర్షన్. మరోవైపు అగ్ర నిర్మాణ సంస్థ - స్టార్ హీరో సినిమా కావడంతో సమంత ఈ ఆఫర్‌ను తిరస్కరించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సాధారణంగా ఇలాంటి పెద్ద ప్రాజెక్ట్‌లను నటీనటులు వదులుకోవడానికి సాహసించరు. కానీ సమంత మాత్రం తాను తీసుకునే నిర్ణయాలపై ఎంతో స్పష్టతతో ఉంటానని మరోసారి నిరూపించారు. కథలో కొత్తదనం .. పాత్ర ప్రాధాన్యతను బట్టే అడుగులు వేస్తున్నారని ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోంది. ప్రస్తుతం సమంత దృష్టిని వెబ్ సిరీస్‌లు, పాన్-ఇండియా ప్రాజెక్ట్‌లు , సొంత ప్రొడక్షన్ వెంచర్లపై ఎక్కువగా కేంద్రీకరిస్తున్నారు. సినిమాల ఎంపికలో సామ్ అనుసరిస్తున్న సెలెక్టివ్ అప్రోచ్ ఆమె కెరీర్‌ను మరింత భిన్నమైన మార్గంలో నడిపిస్తోంది. భారీ ఆఫర్లను సైతం వ్యక్తిగత ప్రాధాన్యతల కోసం పక్కన పెట్టే సమంత తెగింపు ఇండస్ట్రీలో ప్రత్యేక చర్చకు దారితీస్తోంది.

# చిరంజీవితో సినిమా పై వెంకీ అట్లూరి ఇంట్రెస్టింగ్ కామెంట్స్!



'విశ్వనాథ్ & సన్స్' చిత్రంతో వెంకీ అట్లూరి విజయపథంలో దూసుకుపోతున్నారు. బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రానికి మంచి స్పందన లభించడంతో, ఇప్పుడు ఆయన తదుపరి చిత్రంపై అందరి దృష్టి పడింది. ఐతే, ఓ ఇంటర్వ్యూలో, మెగాస్టార్ చిరంజీవి కోసం తనకున్న ఆలోచన గురించి వెంకీ ప్రస్తావించారు. చిరంజీవి కోసం తన దగ్గర ఒక కథాంశం ఉందని, అయితే అంత భారీ స్థాయి చిత్రాన్ని చేపట్టేందుకు తనకు మరికొంత పరిణితి, సమయం అవసరమని వెంకీ చెప్పుకొచ్చారు.వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. 'నాకు చిరంజీవి అంటే చిన్నప్పటి నుంచి ఎంతో అభిమానం. అలాంటి స్టార్ హీరోని సంప్రదించే ముందు దర్శకుడిగా అన్ని విధాలా సంసిద్ధంగా ఉండాలని నేను నమ్ముతాను. అలాగే వెంకీ చెప్పిన మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, చిరంజీవి కోసం అనుకున్న కథాంశం ఒక 'థ్రిల్లర్' అని వెంకీ వెల్లడించారు. మొత్తమ్మీద 'విశ్వనాథ్ ఁ సన్స్' సినిమా సూపర్ హిట్ టాక్ తో దూసుకుపోతోంది. కాగా సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించగా, జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు.


# నాకు అది నచ్చదు.. నేనింతే -- రవితేజ




రవితేజ కథానాయకుడిగా శివ నిర్వాణ దర్శకత్వంలో ఇరుముడి చిత్రం రూపొందుతోన్న విషయం తెలిసిందే. ఈ చిత్రం ఆగస్టు 21న రిలీజ్ కాబోతుంది. కాగా ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా రవితేజ, సుమతో ఓ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో సదురు యాంకర్ మాట్లాడుతూ.. విజయ్ దేవరకొండ -- రష్మిక రిసెప్షన్‌కి సింపుల్‌గా వచ్చారు.. అదే వైరల్ అయ్యింది. అయినా మీరు బయట ఎందుకు తక్కువగా కనిపిస్తారు ? అని అడగగా.. రవితేజ సమాధానమిస్తూ.. 'నాకు బయటకు రావడం, అలాగే ఫంక్షన్స్‌కి వెళ్లడం నచ్చదు. అది నా నేచర్. దానికి వేరే కారణం అంటూ ఏమి లేదు' అని రవితేజ తెలిపారు.ఇక రవితేజ ఇరుముడి సినిమాలో తన కెరీర్ లోనే భిన్నమైన పాత్రలో కనిపించబోతున్నాడు. మొత్తానికి రెగ్యులర్ మాస్ హీరోగా కాకుండా, భావోద్వేగాలతో కూడిన పాత్రలో కనిపించనున్నాడు. పైగా ఫాదర్--డాటర్ ఎమోషన్ తో సాగే సన్నివేశాలు చాలా ఎమోషనల్ గా ఉంటాయట. ఇక ఈ సినిమాలో ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ గా నటిస్తోంది.

# పసుపు చీరలో ఏజ్‌లెస్ క్వీన్ త్రిష కృష్ణన్







దక్షిణాది సినీ పరిశ్రమలో దశాబ్దాలుగా తన ఏకఛత్రాధిపత్యాన్ని కొనసాగిస్తున్న పాపులర్ నటి త్రిష కృష్ణన్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.దక్షిణాది సినీ పరిశ్రమలో దశాబ్దాలుగా తన ఏకఛత్రాధిపత్యాన్ని కొనసాగిస్తున్న పాపులర్ నటి త్రిష కృష్ణన్ తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయబద్ధమైన పసుపు రంగు చీర ధరించి దేవకన్యలా మెరిసిపోతున్న తన ఫోటోలను ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. విశేషమేమిటంటే ఆ చీర తన తల్లిదేనని తెలిపి అభిమానులను మురిపించారు. ఈ రాయల్ లుక్‌లో త్రిషను చూసిన అభిమానులు, నెటిజన్లు -ఏజ్‌లెస్ క్వీన్- అని ప్రశంసిస్తున్నారు.నాలుగు పదుల వయసుకు చేరువవుతున్నా త్రిష గ్లామర్ లో కించిత్ కూడా మార్పు రాలేదని.. రోజురోజుకూ ఆమె మరింత అందంగా తయారవుతున్నారని అభిమానులు మురిసిపోతున్నారు. నటి ఖుష్బూ సుందర్, ఐశ్వర్య కల్పాతి సహా పలువురు సినీ ప్రముఖులు త్రిష అలంకరణకు.. తన అందమైన రూపానికి ఫిదా అయిపోయి ప్రశంసలను కురిపించారు. కొందరు నెటిజన్లు త్రిష క్లాసిక్ సినిమాల్లోని డైలాగులను గుర్తుచేసుకుంటూ ఈ పోస్ట్‌ను సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి తెచ్చారు. మరోవైపు ఈ పోస్ట్ కింద నెటిజన్ల మధ్య తీవ్రమైన రాజకీయ, వ్యక్తిగత చర్చలు కూడా వేడెక్కిస్తున్నాయి. ముఖ్యంగా దళపతి విజయ్ సారథ్యంలోని పొలిటికల్ మీటింగ్‌లు లేదా తమిళనాడు ప్రభుత్వ సభల్లో త్రిష కనిపించడంపై రకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కొందరు అభిమానులు త్రిషను సరదాగా విజయ్ కి చెల్లెలు(తంగచ్చి) అంటూ పోల్చగా.. మరికొందరు మాత్రం విజయ్ రాజకీయ భవిష్యత్తును.. ఆయన భార్య సంగీతను ప్రస్తావిస్తూ త్రిష ఇటువంటి పబ్లిక్ ఈవెంట్లకు దూరంగా ఉంటేనే మంచిదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ చర్చల నడుమ మరికొందరు నెటిజన్లు నటుడు శింబు (మాజీ ప్రియుడిగా ప్రచారం ఉంది) పేరును తెరపైకి తెచ్చారు. విజయ్ పొలిటికల్ ఇమేజ్‌ను ఇబ్బంది పెట్టకుండా.. ప్రస్తుతం సింగిల్‌గా ఉన్న శింబును త్రిష పెళ్లి చేసుకోవచ్చు కదా అంటూ విమర్శనాత్మకంగా.. సరదాగా సలహాలు ఇవ్వడం కనిపించింది. వీటికి తోడు గిల్లి, లియో చిత్రాల్లో వీరిద్దరి కాంబినేషన్‌ను ప్రస్తావిస్తూ వారి ఆన్-స్క్రీన్, ఆఫ్-స్క్రీన్ కెమిస్ట్రీపై నెటిజన్లు రకరకాల విశ్లేషణలు చేశారు.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555